


ఆరోజు......—

తూర్పు తెల్లబడకముందే పల్లె నిద్రలేచింది. అర్ధరాత్రి వూరంతా నిద్దుమణిగాక తగులుకున్న నిప్పు రవ్వ తెల్లవారేసరికల్లా గుప్పుమనడంతో ఒళ్ళు కాలినట్టు పల్లె మొత్తం గొల్లుమంది.

పొద్దు పొడిచినా పొలాలకు వెళ్ళని పాలె కాపులు చప్పుడుకాకుండా చెవులు కొరుక్కుంటుంటే కాకులు సైతం కేకలు మానేసాయి.

పూరి గుడిసెలో కూర్చున్న సీతాలు పొదరిల్లు కూలిన పక్షిలా అనిపించటంతో సూరీడు కూడా నేరేడు కొమ్మల్లో నక్కిపోతున్నాడు.

తెలతెరవారుతుండగా పెదకాపు లోగిలి నుండి గుడిసెకు తిరిగొచ్చిన సీతాలు తెల్లారి పోయిన బ్రతుకోసం తడిల్లి పోతుంటే....

తెల్లవార్లూ "అయ్య" కోసమే అలమటించి పోతోందని భ్రమపడ్డ కూలి జనం రాజయ్యను తలచుకుని జాలితో పొయ్యిల్రాజెయ్యటం మానేసారు.

వూరికి వుత్తర దక్షిణ ధృవాల్లా నిలబడ్డ పెదకాపు చినకాపు లోగిళ్ళు ఒకే రాజ్యాన్ని పాలించే ఇద్దరు శత్రురాజుల వైభవాన్ని గుర్తుచేసే ఆ గ్రామంలో ఉత్తరంవేపులోగిలిపై వాలిన ఏ కాకీ దక్షిణానికి ఎగిరే సాహసం చేయదని వూరంతటికీ తెలుసు.

రెండు లోగిళ్ళ మధ్య పూరి గుడిసెలుకాక పచ్చిక బయళ్లే వుండివుంటే ప్రతి క్షణమూ రావణ కాష్టంలా సెగలు చిమ్మేటంత 'పగలు' గొప్పోళ్ళిద్దర మధ్యా వున్న నిజం గుడిసెవాసులందరికీ తెలుసు.

ఇంత తెలిసిన వూరివాళ్ళకు పాలేరు రాజయ్యను పెద కాపు ఎంత ఇష్టపడేదీ కూడా తెలుసు.

తెలియనిదల్లా........

ఆ రాత్రి చినకాపు పొలంలోని వరి కుప్పలు ఎలా తగలబడ్డాయన్నదీ.... అలా తగలబెట్టింది రాజయ్యేనని పోలీసులు అర్ధరాత్రివేళ అతగాడ్ని లాక్కుపోతుంటే అండగా నిలబడాల్సిన పెదకాపు చేతులు ముడుచుకుని ఎలా కూర్చున్నాడన్న దీనూ....

అందుకే వూరంతా తరలివచ్చినా సీతాలును వూరడించలేక వూరుకుండి పోయింది.

వూరకే వుండలేని సీతాలు పొద్దు గూకిన బ్రతుకును తలచుకుంటూ పొద్దుపోయేవంకూ కూర్చుండి పోయింది,

వెగటు పుట్టిస్తున్న పగటిని మేస్తూ చిరు చీకటి చుట్టూ అలుముకుంటున్న వేళ....

నాటుసారా వాసనతో గుడిసె మొత్తం ఘాటుమంది.

ముందు నిలబడ్డ కోటిగాడ్ని చూసి చటుక్కున వులికిపడ్డ సీతాలు మిగిలిన బ్రతుకులో ఇంకేం మిగిలిందనుకుంది?!

సోలిపోయిన సంపెంగ పువ్వులా కూలిపోయిన కుందనపు బొమ్మలా కనిపించిన సీతా



# చీకటి మెరుపు

కొమ్మనాపల్లి గణపతిరావు

లును చూసిన కోటిగాడు కదిలిపోయాడ

'రాలుగాయి రవిడీము' అనుకున్న కోట ాడు కుప్పలు ఎవరు తగలబెట్టిందీ చెప్పగానే ెప్ప లార్చకుండా చూసింది.

మను వాడతానని వెంటపడ తుంటే ుఱు సుగా దుమ్మెత్తిపోసే సీతాలు కల్లాకపట లేని కోటిగాడి మాటలకు కళ్ళు నీళ్ళెట్టుకుంది.

కోటిగాడి ఓదార్పుతో గుండెవాగుకు గండి పడినట్టయి సిగ్గుమాలిన విషయాన్ని సిగ్గు విడిచి చెప్పేసింది.

సంగతి విన్న కోటిగాడు కాష్టంలా మారి పోయాడు.

కుప్పలు తగలబడ్డ సత్యం వెనుక కాలి కుప్పగా కూలిపోయిన సీతాలు కథ వింటూ క్రోధంగా బయటికి నడిచాడు.

అసలు....

నిన్నటి రోజు....

నూరేళ్ళ బ్రతుకుపై మోజును చంపిన

ముదనష్టపు రోజు....

సూర్యుడు నడినెత్తిపై నిప్పులు చెరుగుతున్న వేళ అలవాటుగా అయ్యకు అన్నం పట్టుకెళ్ళిన సీతాలు పొద్దు గూకిన తర్వాత పెదకాపు యింట ఏదో పనుందని, రాధమ్మ కబురెట్టిందని చెప్పగానే వెళ్ళనని చెప్పలేక పోయింది.

కారణం-వెళ్ళనంటే అయ్య 'వల్లకోడ' ని సీతాలుకు తెలుసు.

అయ్యలా ఆదరించే పెద్దయ్యగారంటే ఆమెకు భయం లేదు—చిన్నింటిదని చిన్నచూపు చూసే పట్నంలో చదువుకున్న రాధమ్మ అంటే బెదురు....

ఒంటికి నలుగుపిండి రుద్దుకుంటుంటే ఏటి గట్టున ఎప్పుడో చినకాపు కొడుకు చెయ్యిపట్టుకుని సరసమాడబోయిన విషయం గుర్తుకొచ్చి గుండె గుబగుబలాడింది.

"పెళ్ళీడుకొచ్చిన పిల్లని పరాయింటికి పంపే సత్తువలేని యెదవని....తప్పు ఆల్దిగాదోలమ్మీ. అయినోల్లతో మనమేటి నెగ్గుకురాగలవేం బొట్టే ...." అంటూ కళ్ళనీళ్లు పెట్టిన అయ్య మాటలు జ్ఞప్తికొచ్చాయి.

"ఏవీం లేకపోతేమాత్తరం .... యిపాసారి దాన్ని అనుకుండుగావాల్న" అనుకుంటూ తడికవార్న స్నానంచేసి పోలేరమ్మ పండక్కి అయ్యకొన్న సరిగంచు చీర ఒంటికి చుట్టుకుంది.

పగిలిన అద్దంలో మొగలిరేకులా మిలమిల్లాడుతున్న మొహాన్ని చూసుకుని కొన్ని క్షణాల పాటు మురిసిపోయిన సీతాలు పెదకాపు లోగిలికి బయలు దేరింది.

మసక చీకటి ముసురులో పెళ్ళికొచ్చిన పిల్లలా పల్లె ఒదిగిపోతున్న వేళ లోగిలిలో అడుగుపెట్టిన సీతాలు బిక్కు బిక్కుమంటూ ద్వారం పక్కనే నిలబడిపోయింది.

బానిసలా ఒదిగివున్న సీతాలును భేషజంతో చూసిన రాధమ్మ పాడేరు అడవులకు వేట నిమిత్తమై వెళుతూ ఆరాత్రి తమ ఇంట విడిదిచేసిన తండ్రిగారి మిత్రద్వయం గురించి, వారు చేసుకోబోయే పార్టీ గురించి అక్కడ సీతాలు చేయాల్సిన సపర్యల గురించి సవివరంగా విశదపరిచింది.

విశాలమైన ఆ భవంతిలోని ఓ మారుమూల గదిలో మంద్రంగా వెలుగుతున్న విద్యుద్దీపాల కాంతిలో పార్టీ మొదలైంది. దారితప్పిన పులుల్లా భారీగా కనిపించిన వ్యక్తుల్నిద్దర్నీ చూసి ముందు భయపడిన సీతాలు పెదకాపు కూడా ఆ గదిలోనే వుండటంతో కాస్త ధైర్యం తెచ్చుకుంది.

వారు తాగుతున్న పచ్చని ద్రవం ప్రత్యేకంగా తెప్పించుకున్న మనుష్య రక్తంలావుంది

మత్తుగా వస్తున్న వారి మాటలు వింటుంటే కొండలు పేలి బండరాళ్ళు దొర్లుతున్నట్టుగ వుంది.

కోడిమాంసాన్ని ఎముకలతో సహా కరకరా నమిలే తీరుచూస్తుంటే పదినిముషాల వ్యవధిలో పల్లెను మొత్తం నొల్లుకునే రాక్షసుల్లా అనిపించారు.

రంగికి భయంగా వుంది.

బెరుగ్గావుంది, అయినా అవసరానికి అన్నీ అమరుస్తోంది.

పార్టీ తొందరగా పూర్తి అయితే బాగుణ్ణు అన్న ఆరాటంలో బితుకు బితుకుమంటూ ఓ మూల నిలబడింది.

"పెద్దయ్య గోరూ...."

ఎవరో పిలిచినట్టి అర్జెంటుగా బయటకు నడిచాడు పెదకాపు.

చిత్తుగా తాగి నిలబడ్డ కోటిగాడ్ని చూడగానే పెదకాపుకి సత్తువ వచ్చినట్టయింది.

పక్క గదిలోకి లాక్కుపోయి పదినిముషాల పాటు కౌన్సెక్కించాడు.

కరెన్సీని కోటిగాడి జేబులోకుక్కి మంత్రించిన త్రాచుగా మార్చి బంగళా బయటవరకూ సాగనంపాడు.

మరి కొన్ని క్షణాలతో వరికుప్పలు తగలబడే దృశ్యాన్ని ఊహించుకుంటూ తన రాజకీయపు కత్తుగడలో చినకాపు చిత్తుగా ఓడిపోయే సంఘటన్ని స్మరించుకుంటూ పార్టీ జరుగుతున్న గదిలో అడుగు పెట్టిన పెదకాపు రాక్షస హస్తంతో మొహంపై చాచికొట్టినట్టు ఉలిక్కి పడ్డాడు.

అంతా నంజుకుని ఇంకేం మిగిలిందని వెర్రి మొహాలువేసుకు నిలబడ్డ స్నేహితుల్ని 'శత్రువుల దండయాత్రలో శిధిలమైన శిల్పంలా' పంజా దెబ్బల హోరులో ప్రాణాలు కడంటి పోయిన లేడి పిల్లలా నిస్ప్రాణంగా నేలపై పడివున్న సీతాలును చూడగానే అతడికి అంతా అర్ధమైపోయింది.

"అయ్యగారూ...." అంటూ కాళ్ళకుచుట్టేసిన సీతాలు నట్టేట కలిసిన బ్రతుక్కి సంజాయిషీ అడుగుతున్నట్టుగా వుంది.

కొన్ని క్షణాలపాటు....

పెదకాపు మెదడు చెదపట్టిన చెట్టుమొదల్లా అయిపోయింది.

పిల్లుల్లా తన ముందు బ్రతికే కూలిజనం పిడికిళ్ళు బిగించుకుంటూ ప్రవాహంలా మీదికొస్తున్నట్టూ.......

అదను కనిపెట్టిన చినకాపుతందర్నీ ఆసరా చేసుకుని తన అంతం చూడబోతున్నట్టూ....

అక్కడ మంటల్లో చినకాపు వరికుప్పలు....

ఇక్కడ పెదకాపు గుండెల్లో గునపాల చప్పుళ్ళు....

ఏం చేయాలో పాలుపోని పెదకాపు మిత్రులిద్దర్నీ అర్ధరాత్రి అర్జెంటుగా సాగనంపేసాడు.

కాని సీతాలును మాత్రం గదిలోనే బంధించేసాడు....

వరండాలో వాలు కుర్చీలో సాగిలబడిన పెదకాపు ఉప్పెనలో కొట్టుకుపోతున్నట్టు ఉక్కిరి బిక్కిరై పోయాడు.

చల్లగా వీస్తున్నగాలి కూడా ఎగతాళి చేస్తున్నట్టుగా అనిపించింది.

గడవనిరాత్రి గడుస్తున్న కాలం గుండెలకు గాలం వేసి లాగుతున్నట్టుగా వుంది.

అరక్షణంపాటు కళ్ళుమూసుకున్న పెదకాపు బూట్ల చప్పుడికి జడిసినట్టుగా కళ్ళు తెరిచాడు ....

ఎదురుగా పోలీస్ యస్సై ....

**ఒళ్ళు జలదరించింది.**

అప్పుడే సీతాలు విషయం వీళ్ళవరకూ ఎలా పాక్కిందా అని సంశయిస్తుండగా "చినకాపు గారి వరికుప్పలు తగలబడ్డాయి" అన్న యస్సై మాటలు చల్లగా వినిపించాయి.

తెప్పరిల్లిన పెదకాపు కొంపదీసి కోటిగాడు దొరికిపోలేదుగదా అనుకుంటూ "అరెరె .... ఎంతపన్జరిగింది" అన్నాడు. అంతకంటే ఇంకేమనాలో అర్ధంకాక ....

"చినకాపుగారు మిమ్మల్ని అనుమానించడంతో ఇంత రాత్రివేళ మీ స్టేట్ మెంట్ కోసం డిస్టర్బ్ చెయ్యటం తప్పని సరైంది"

ఇది ముందే వూహించడంతో పెద్దగా ఇబ్బంది పడలేదు పెదకాపు ....

"ఎంతమాటన్నారు .... మా మజ్జిన గొడవలూ గట్రావున్న మాట నిజమే ననుకోండి.... అలాగని ఇలాటి యెదవపని జేస్తానా .... అందులోనూ మా లచ్చిమ్మనాటి పంటకి నిప్పంటిత్తే కళ్ళోత్తాయిని నాకు తెల్దా ... " అంటూ ధనలక్ష్మిమీద తన భక్తి తత్పరతల్ని ప్రకటిస్తుండగా తళుక్కున ఓ ఆలోచన మెరిసింది.

ఇక ఆలస్యం చేయడం అవివేకమని తలచిన పెదకాపు "యెదవెంత పన్జేసాడు....అప్పటికీ చెబుతూనేవున్నా....వద్దురా అని" అంటూ ముగించేసరికి ఎవడు వాడు ఏమా కథ అన్నట్టుగా చూశాడు యస్సై....


"ఆడంటే..ఆడేనండీ మా పాలేరు రాజయ్య. అల్లప్పుడెప్పుడో చినకాపు కొడుకు ఆడి కూతుర్నేదో అంటే అది మనసులో యెట్టుకుని ఆడ్ని యెప్పటికైనా దొంగదెబ్బ తీస్తానంటే తప్పుగా అని దెబ్బలాడినాను కూడాను. ఆడురుకి అన్నంత పనీ చేసినాడన్నమాట.... ఎర్రపీనుగ. ఇలగజేస్తే మా యిద్దరి మజ్యా గొడవల మూలంగా అదికాస్తా నా మీదకే తోసి యొచ్చని....ఎంత గోరం...." అంటూ చినకాపు అనుమానాన్ని సమర్థించడం మొదలు పెట్టాడు.

పెదకాపు రాజకీయం గెలవటంతో రాత్రికి రాత్రే రాజయ్యను పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు.

తన తెలివికి తీరుబాటుగా సంతసించిన పెదకాపు సీతాలుని సమీపించాడు....

"ఎంత కసుంటే మా తరం ఇలాటి యెదవ పన్జేస్తాడంటే మీ అయ్య....అందమానుకి అంపేరు" అంటూ జరిగినదంతా ఏకరువు పెట్టి సీతాలు మరింత కృంగి పోయేట్టుచేసాడు.

వళ్ళు తరబడి ఏపూటకూ నోచుకోని పోతే తమ్మలా వులుకూ పలుకూ లేకుండా నిలబడి




పోయిన సీతాలు ఏం జరిగిందో అర్థమయ్యాక అయ్యగారి కాళ్ళమీద పడిపోయింది.

బుగ్గయిపోయిన తన బ్రతుక్కంటే తన కోసం బ్రతుకుతున్న అయ్యే ముఖ్యమనుకుంది.

"నీకేటి బయంలేదే....సీతాలూ.... నేనున్నాగా....అయితే ఒకటి. ఇక్కడ జరిగింది నువ్విక్కడే మరిసిపోవాలా అని నేనంటే నువ్వు 'ఊఁ' అనాల....యెంటనే నేనూ 'ఊ' అనిసి మీఅయ్యను రచ్చించేస్తాను....ఏటం గావు....ఊ అనేసినట్టైనా...."

దుఃఖంతో గొంతుపూడుకుపోయిన సీతాలు కంఠం నుండి వినబడ్డ మూలుగు 'ఊ' అన్నట్టే అనిపించడంతో వెంటనే ఇంటికి పంపేసాడు.

సమస్య అంతటితో తీరిపోయిందని తలవని పెదకాపు ప్రొద్దుటే అనకాపల్లి అప్పారావు కోసం కబురు కూడా పెట్టించేసాడు....

ఆప్తమిత్రుడైన అప్పారావు అనకాపల్లిలో లీడింగ్ లాయరని - డబ్బు పారేస్తే పీనల్ కోడ్ మెడకూడా వురితాడు బిగించగల సమర్థుడని ఎంతో నమ్మకం కలవాడు కాబట్టి పైగా 'కలవాడు' కాబట్టి అప్పారావుని చూడగానే సాక్షాత్తు సింహాద్రి అప్పన్న ప్రత్యక్షమైనంత అబ్బురపడిపోయాడు.

పెదకాపు చెప్పిందంతా విన్న అప్పారావు పేలెంటు నవ్వుతో గదిని అదరగొట్టాడు.

"గొప్పోళ్ళ మధ్య కక్షలుండటం ఎంత సహజమో కక్షలున్నపుడు కుప్పలు తగలబడిపోవటమూ అంతే సహజం .... ఇక సీతాలు విషయానికొస్తే.... మనిషన్నవాడు మందు కొట్టడం ఎంత సహజమో, మందు కొట్టాక మానభంగం చేయటమూ అంతే సహజం...." అంటూ పెదకాపుకి అర్థంకాని అక్షరసత్యాలు ఉద్బోధించాడు.

అప్పారావు మాటల్లో అసదృశమైన హాయిని అనుభవిస్తున్న పెదకాపు హఠాత్తుగా మళ్ళీ ప్రత్యక్షమైన యస్సయిని చూడగానే అలవాటులేనివాడు ఆముదం తాగినట్టు మొహం పెట్టేడు.

అప్పారావును విష్ చేసిన యస్సయి పెదకాపువేపు ప్రశ్నార్థకంగా మొహంపెట్టి "కోటిగాడని మీ దగ్గర ఓ మాజీ నేరస్తుడు వున్నాడనీ వాడే ఈ పనిచేసాడని మాకు కొన్ని ఆధారాలు దొరికాయి. వాడు...." అంటూ అర్థోక్తితో ఆగిపోగానే పెదకాపు మొహం పేతకళతో పాలిపోయింది

కోటు జేబులో నోట్లు నింపుకున్న అప్పారావు క్లయింట్ అవస్థచూడలేక "భలేవారే ఇన్‌స్పెక్టర్...." అంటూ పగలబడి నవ్వేడు....

ఏదో చెప్పాలనుకున్న ఇన్‌స్పెక్టర్, ఏది నాకు దారి అని వెర్రిమొహం వేసిన పెదకాపు యిద్దరూ అప్పారావు అర్థంలేని నవ్వుకేసి అర్థంకాని వారిలా చూసారు....

"కోటిగాడు మొన్న రాత్రే భువనేశ్వర్ వెళ్లాడు. అక్కడ వీరికి ద్రాక్షతోటలున్నాయిగా. వీళ్ళ అబ్బాయికి అండగా వుండానని .... చెప్పరేం" అంటూ ఉప్పందించేసరికి సురే' అన్నాడు పెదకాపు అబోలా మొహం పెట్టి....

"ఐసీ" అంటూ తలపంకించిన యస్సై భువనేశ్వర్‌లోని పెదకాపు కొడుకుండే ఎడ్రసు తీసుకుని వెళ్లిపోయాడు.

"అదేంటండి అప్పారావుగారూ .... భువనేశ్వర్‌లో నాకు ద్రాక్షతోటలుండటమూ నిజమేననుకోండి....కాని కోటిగాడు యీడనే వుండుగదండీ ...." అంటూ ఆందోళన వ్యక్తపరచగానే పోస్ట్‌గ్రాడ్యుయేట్ ఫస్ట్‌ఫారం కుర్రాడికేసి చూసినట్టు చూసాడు అప్పారావు.

"నో .... కోటిగాడు ఇక్కడవున్నా — పోలీసుల రికార్డు ప్రకారం నిన్నరాత్రి అంటే కుప్పలు తగలబడ్డ సమయానికి వాడు భువనేశ్వర్‌లోనే వున్నాడు.... అంతేకాదు వాడు సరిగ్గా అదే సమయానికి తాగి ఎవడ్నో కొట్టేడన్న నేరంపై అరెస్టు చెయ్యబడ్డాడు కూడా" అంటూ మతిలేని శిక్షా స్మృతిగురించి ఆగకుండా అనర్గళంగా ఉపన్యాసం ఇచ్చాడు....

"అది సరేననుకోండి ... ఇదంతా ఎలా సాధ్యమేనంటారా"

"ఎందుకాకూడదండి.... మీ దగ్గర డబ్బుంది.... నా దగ్గర తెలివుంది—అపునా.... భువనేశ్వర్‌లో డబ్బుక్కక్కుర్తి పడే నాలాంటి మరో లాయరు - పరపతున్న నా మిత్రుడు సుదర్శనం వున్నాడు. అంటే .... మీ దగ్గర డబ్బుంది .... నాదగ్గర తెలివుంది.... నాకో మిత్రుడున్నాడు .... వాడికక్కడ పరపతుంది .... అంతకన్నా ముఖ్యంగా వాడికి డబ్బు అవసరమూవుంది....కాబట్టి.... ఆ డబ్బు అదే మీ దగ్గర మూలుగుతున్న డబ్బు అవసరార్థం అక్కడ ఓ కోటిగాడ్ని సృష్టిస్తుంది .... అదే డబ్బు ఆ కోటిగాడు పోలీసుల రికార్డులకెక్కి .... ఇక్కడ వరికుప్పలు కోటిగాడు తగలబెట్టలేదని నిరూపించి...."

అర్జెంటుగా పెదకాపుదగ్గర మరింత డబ్బు తీసుకుని వెళుతూ "ఒక్కమాట....నేను ట్రంకాల్లో వ్యవహారం నడిపిస్తాను. మీరు మాత్రం కోటిగాడు బయట తిరక్కుండా చూడండి." అంటూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను గూర్చి హితబోధచేసాడు.

అన్ని గండాల నుంచీ హాయిగా గట్టెక్కినంత ధీమాతో ప్రశాంతంగా ఓ నిట్టూర్పు విడిచాడు పెదకాపు....

చెరచబడిన మూగ స్త్రీలా చీకటి రోదిస్తున్న అపరాత్రివేళ....

మనసులోని అలజడుల్ని మందుతో మాయం చేసుకుని మత్తుగా నిద్రిస్తున్న పెదకాపు హఠాత్తుగా వినబడ్డ ఆర్తనాదంతో ఉలిక్కిపడి మేల్కొన్నాడు.

చుట్టూ తన పాపంలా పేరుకు పోయిన చిక్కటి చీకటి....

సమీపంలో సన్నగా మూలుగు....

పెదకాపు గుండె గడగడా వణికింది.

తను విన్న ఆర్తనాదం పీకలలో కాదని ప్రక్కనేవున్న కూతురి గదిలో నుంచే అని తెలుసుకోగానే ఆందోళనగా పరుగెత్తాడు.

నేలపై నిస్త్రాణగా నిస్సత్తువగా నిన్నటి రాత్రి సీతాలులాపడివున్నకూతురు రాధమ్మను చూడగానే "ఏం జరిగిందమ్మా" అంటూ అడగబోయిన పెదకాపు కాటేసి కసి తీర్చుకున్న త్రాసులా ఉరుకుతున్న కోటిగాడ్ని చూసి ఏం జరిగిందో అర్థం చేసుకున్నాడు.

"అమ్మలం....కోడకోయ్" అంటూ గుండెలు బాదుతున్న పెదకాపు పులిలా కోటిగాడి వెంటపడ్డాడు,

చీకటి....చీకటి....చిక్కని చీకటి....

కోటిగాడు తప్పించుకున్నాడు....

పెదకాపు పరుగు నాపలేదు....

సెగలై మండిస్తున్న పగతో కోటిగాడ్ని ఉరికంబం ఎక్కించే కసితో పరుగుపెడుతూ అనకాపల్లి చేరుకున్నాడు....

పోలీసు స్టేషన్లో ఆయాసంగా అడుగుపెట్టిన పెదకాపు న్యాయం కోసం నానా హైరానా పడే పేదవాడిలా చేతులు జోడించాడు....

చిత్రగుప్తుడిలా చిట్టాలు తిరగేస్తున్న యస్సై పెదకాపుని చూడగానే పైకిలేచి "రండి పెదకాపు గారూ....ఇప్పుడే మాకు భువనేశ్వర్ నుండి ఇన్ఫర్మేషను అందింది. మీకోటిగాడు.... నిన్నరాత్రి....అంటే కుప్పలు తగలబడ్డ సమయానికి నార్కేడ్‌గాం పోలీసుల చేత అరెస్టు చేయబడి ఇంకా అక్కడ పోలీసు కస్టడీలోనే వున్నాడని...." అంటూ చెప్పుకుపోతున్నాడు........